నమస్తే తెలంగాణ
జగిత్యాల
3 | కరీంనగర్, బుధవారం 9 అక్టోబర్ 2024 | JAGTIAL


# అబద్ధపు హామీలతో కాంగ్రెస్ వంచన

- నాగుల మల్యాలలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్
- ₹2 కోట్లతో రహదారి నిర్మాణ పనులు ప్రారంభం



నాగులమల్యాలలో రహదారి నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కొత్తపల్లి, అక్టోబర్ 8 : ఆచరణ సాధ్యం కాని అబద్ధపు హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కి ప్రజలను వంచించిందని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శించారు. మంగళవారం కొత్తపల్లి మండలం నాగులమల్యాలలో ₹2 కోట్లతో నాగులమల్యాల నుంచి నర్సింగాపూర్ వెళ్లే కట్ట దారి నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలో రోడ్లను నిర్మించడంతోపాటు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. కమ్యూనిటీ హాళ్లు నిర్మించామని, ఇంకా ఏమైనా చివరి దశలో ఉంటే వాటి వివరాలు అందజేయాలని అధికారులకు సూచించారు. తన రాజకీయ జీవితంలో ఎక్కువ సమయం ప్రతిపక్షంలోనే ఉండి పోరాటాలు, ఉద్యమాలు చేశానని గుర్తు చేశారు. ఈ సందర్భంగా తమ గ్రామంలో రైతులందరికీ రుణమాఫీ కాలేదని, రైతుబంధు ఇప్పటి వరకు అందించలేదని రైతులు ఎమ్మెల్యేకు ఏకరువుపెట్టారు. ఆరు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని గ్రామ పారిశుధ్య కార్మికులు వాపోయారు. ₹4వేల పెన్షన్ ఇవ్వడం లేదని పెన్షన్‌దారులు చెప్పారు. గతంలో మంత్రిగా ఉన్న సందర్భంలో ఆచంపల్లి దగ్గర వరద కాలువకు తూము ఏర్పాటు చేసి గ్రామాలకు సాగునీరు అందించిన ఘనత మీదేనంటూ ఎమ్మెల్యే గంగులను ప్రజలు కొనియాడారు. అంతకు ముందు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పిల్లి శ్రీలత మహేశ్‌గౌడ్, కరీంనగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రెడ్డవేణి మధు, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు కాసారపు శ్రీనివాస్, మాజీ జిల్లా కో ఆప్షన్ సభ్యుడు సాబీర్ పాషా, వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్, మాజీ సర్పంచ్ నాయిని ప్రసాద్, మాజీ ఎంపీటీసీ కొమ్ము హేమలత, బావుపేట మాజీ ఎంపీటీసీ కమల మనోహర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్ పాల్గొన్నారు.



# మామూళ్ల వసూళ్లకు కొత్తదారులు?

## సిరిసిల్ల, వేములవాడ ట్రెజరీ కార్యాలయాల్లో నయా పంథా




- సన్నిహితులకు గూగుల్ పే, ఫోన్ పే చేయిస్తున్న అధికారులు
- ఏసీబీ రైడ్ చేసినా చిక్కకుండా ఉండేందుకే ఈ ప్లాన్
- ఉద్యోగి ఎవరైనా సస్పెండ్ అయితే పండుగే
- కొర్రీలు పెట్టకుండా ఉండేందుకు సదరు ఉద్యోగి నుంచి ₹50వేలు వసూలు
- నిఘా వర్గాల విచారణలో వెలుగులోకి వస్తున్న విషయాలు
- వెల్లువెత్తుతున్న ఆరోపణలు

**ట్రెజరీ అధికారులు మామూళ్ల వసూళ్లకు సరికొత్త దారులు వేసుకున్నారు. ఏమాత్రం అనుమానం వచ్చినా.. నేరుగా లంచం తీసుకోకుండా తమ సన్నిహితులు, బంధువులకు గూగుల్ పే, ఫోన్‌పే చేయిస్తున్నారు. డబ్బులు ముట్టినట్టు కన్ఫర్మేషన్ అయిన తర్వాత మాత్రమే ఆ ఫైల్‌ను కదుపుతున్నారనే ఆరోపణలు వస్తుండగా, ఏసీబీకి చిక్కకుండా ఈ మార్గాన్ని ఎంచుకున్నట్టు తెలుస్తున్నది. ఇక ఎవరైనా ఉద్యోగి సస్పెండ్ అయితే ట్రెజరీ అధికారులకు పండుగే! తన సర్వీస్ రికార్డుల్లో కొర్రీలు పెట్టకుండా ఉండేందుకు ఒక్కొక్కరి నుంచి ₹50వేలు వసూలు చేస్తున్నారని ఓ బాధిత ఉద్యోగి వాపోయాడు. ఇవేకాదు, ట్రెజరీ కార్యాలయాలకు వెళ్లిన ఏ ఫైల్ కూడా మామూళ్లు ముట్టకుండా బయటకు రావడం లేదని తెలుస్తుండగా, ప్రస్తుతం నిఘావర్గాల విచారణలో ఆమ్యామ్యాల వసూళ్లకు సంబంధించి అనేక కొత్త కోణాలు వెలుగు చూస్తున్నాయి. కాగా, రెండు రోజులుగా ట్రెజరీ కార్యాలయాలు, అందులోనూ సిరిసిల్ల, వేములవాడ ట్రెజరీ, సబ్ ట్రెజరీ ఆఫీస్‌లపై 'నమస్తే తెలంగాణ' ప్రచురిస్తున్న కథనాలు సంచలనం రేపుతున్నాయి. వీటిపై సమగ్ర విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని పీఆర్‌టీయూ తెలంగాణ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు మ్యాడారం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి కే హరేందర్‌రెడ్డి బాహాటంగా డిమాండ్ చేసిన తీరు, ఇక్కడి కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతికి అద్దం పడుతున్నది.**

### అవినీతిపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలి



రాజన్న సిరిసిల్ల జిల్లా ట్రెజరీ, సబ్ ట్రెజరీతోపాటు వేములవాడ ఎస్టీవో కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతి బాగోతంపై ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో నిష్పక్ష పాతంగా విచారణ జరిపాలి. దోషులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులు సక్రమంగా పొందాల్సిన బిల్లులపై వసూళ్లకు పాల్పడడం, చేతులు తడపనిదే బిల్లులు అప్‌లోడ్ చేయకపోవడం అన్యాయం. బాధితులను మానసికంగా ఇబ్బంది పెట్టడం సిగ్గు చేటు. బాధితులైన రిటైర్డ్ ఉపాధ్యాయ, ఉద్యోగులకు అండగా నిలవాల్సిన కొందరు సంఘ నాయకులు, అవినీతికి పాల్పడిన అధికారులకు వత్తాసు పలుకడం అన్యాయం. దీనికి సంబంధమున్న ప్రతి సంఘ నాయకులపై విచారణ చేపట్టి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి.

**- మ్యాడారం హరికృష్ణ (పీఆర్‌టీయూ తెలంగాణ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు), కే హరేందర్ రెడ్డి (జిల్లా ప్రధాన కార్యదర్శి)**

కరీంనగర్, అక్టోబర్ 8 (నమస్తేతెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాలోని మెజార్టీ ట్రెజరీ, సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో జరుగుతున్న లావాదేవీలపై ఆరోపణలు వస్తున్న విషయం తెలిసిందే. ప్రధానంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ట్రెజరీ, సబ్‌ట్రెజరీతోపాటు వేములవాడ సబ్‌ట్రెజరీ కార్యాలయాలపై ఇటీవలి కాలంలో పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడ కూడా కొంత మంది అధికారులు నిబంధనలకు లోబడి పని చేస్తున్నా, అవినీతికి పాల్పడే మరికొంత మంది అధికారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. దీంతో ఆ శాఖ మొత్తానికి అవినీతి మచ్చ అంటుకుంటున్నది. ఈ నేపథ్యంలో పింఛన్ కోసం రిటైర్డ్ అయిన ఉద్యోగుల ఫైల్ అప్‌లోడ్ చేసేందుకు ఒక్కొక్కరి వద్ద ₹5 నుంచి ₹10 వేల దాకా వసూలు చేయడం, ఇవ్వకపోతే ముప్పు తిప్పలు పెట్టడం, ప్రశ్నించే వారిపై కక్ష కట్టడం.. లాంటి ఆరోపణలతో పాటు మొత్తంగా అవినీతికి కేరాఫ్‌లా మారిన తీరుపై రెండు రోజులుగా 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలు సంచలనం సృష్టిస్తున్నాయి. దీనిపై హైదరాబాద్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఇప్పటికే నిఘా వర్గాలు విచారణ జరుపుతున్నాయి. ఆ మేరకు అనేక కొత్త అంశాలు తెరపైకి వస్తున్నాయి. ఇక్కడ పనిచేసే కొంత మంది ఉద్యోగులు మామూళ్ల వసూలు చేయడంలో ఆరితేరినట్టు విచారణలో వెలుగు చూస్తున్నది. లంచాలు తీసుకునే సమయంలో ఏమాత్రం అనుమానం వచ్చినా చిక్కకుండా ఉండేందుకు కొత్త పంథాను అనుసరిస్తున్నారు. ఉద్యోగి బంధువు లేదా స్నేహితుడి ఫోన్ నంబర్‌కు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా అమ్యామ్యాలు అందేలా చూస్తున్నారు. అవి ముట్టినట్టు కన్ఫర్మేషన్ అయిన తర్వాత మాత్రమే సంబంధిత ఫైల్ కదుపుతున్నారని విచారణ అధికారులకు బాధితులు సమాచారం ఇచ్చినట్టు తెలుస్తున్నది. ఒకవేళ ఏసీబీ అధికారులు ఆకస్మికంగా రైడ్ చేసిన నగదు దొరకకుండా ఉండడంతోపాటు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడకుండా ఉండేందుకు ఈ కొత్త పంథాను అనుసరిస్తున్నారని ఓ రిటైర్డ్ ఉద్యోగి వివరించారు. వసూళ్ల వ్యవహారం కేవలం పింఛన్ ఫైలుకు మాత్రమే పరిమితం కావడం లేదన్న సమాచారం వస్తున్నది. ఒక ఉద్యోగి లేదా ఉపాధ్యాయుడు ఏదేని కారణాల వల్ల విధి నిర్వహణలో సస్పెండ్ అయితే.. ఆ విషయంపై కొర్రీలు వేయకుండా ఉండేందుకు సదరు ఉద్యోగులు ఒక్కొక్కరి నుంచి ₹50వేలు వసూలు చేస్తున్నట్టు అత్యంత విశ్వసనీయ సమాచారం. ఇలా లంచం ఇచ్చిన ఓ ఉపాధ్యాయుడు ఇటీవలే పదవీ విమరణ పొందారు. అంతేకాదు, సంఘ నాయకుల ఫైళ్లకు కూడా మామూళ్ల ఇవ్వక తప్పలేదని ఓ ఉపాధ్యాయ సంఘ నాయకుడిగా పనిచేసి ఇటీవల రిటైర్డ్ అయిన టీచర్ తన ఆవేదనను 'నమస్తే'తో పంచుకున్నారు. ఒకరిద్దరు కాదు, కొంత మంది అధికారుల మామూళ్ల దాహానికి వందల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు బలయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా నిఘా వర్గాల విచారణకు మాత్రమే పరిమితం కాకుండా, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు కూడా జోక్యం చేసుకొని నిష్పక్షపాతంగా విచారణ జరిపిస్తే పాపాలపుట్ట బయటకు వస్తుందన్న డిమాండ్ బాధిత ఉద్యోగుల నుంచి వ్యక్తమవుతున్నది.

### ప్రతి పనికీ ఓ రేటు?

ట్రెజరీ కార్యాలయాల్లో ఒక బిల్ పాస్ కావాలంటే ప్రతి పనికీ ఓ రేటు కడుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఉమ్మడి జిల్లాలోని పలు సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో మాత్రం అవినీతి పెచ్చుమీరుతున్నదని పలువురు ఉద్యోగులే చెబుతున్నారు. పంచాయతీ కార్యదర్శి నెలనెలా సమర్పించే బిల్లులు నుంచి మొదలు ఇతర అన్ని పనులకు ముక్కుపిండి మామూళ్లు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అడిగిన మొత్తం ఇవ్వకపోతే అనేక కొర్రీలు పెట్టి, ముప్పు తిప్పలు పెడుతున్నారు. కాగా, ప్రస్తుతం నిఘా వర్గాల విచారణలో అనేక అంశాలు వెలుగులోకి వస్తున్నట్టు తెలుస్తున్నది. కొన్ని ట్రెజరీ కార్యాలయాల్లో పై అధికారులు బాగానే ఉన్నా.. కింద నుంచి ఫైల్ కదపాలంటే ముందుగా వారికి ఆమ్యామ్యాలు ముట్టజెప్పాల్సిందేనని, అప్పుడే ఆ ఫైల్ ముందుకెళ్తుందని చెప్పినట్టు తెలుస్తున్నది. అంతేకాదు, వేములవాడలో ట్రెజరీ కార్యాలయంలో పనిచేసే ఇద్దరు ఉద్యోగుల తీరుపై అనేక ఆధారాలు నిఘావర్గాలకు చూపించినట్టు తెలుస్తున్నది. లంచాలు వసూలు చేయడంలో వారికి వారే సాటని, ఒక వేళ అడిగింది ఇవ్వకపోతే నెలల తరబడి తిరగాల్సి వస్తుందని, అందుకే ఆర్థిక పరిస్థితులు సహకరించినా సహకరించక పోయినా.. మామూళ్లు ఇవ్వక తప్పలేదని ఆవేదన వ్యక్తం చేసినట్టు సమాచారం. లంచావతారులు సంఘ నాయకులను కూడా వదిలి పెట్టడం లేదని ఓ సంఘానికి చెందిన నాయకుడు తన ఆవేదన వ్యక్తం చేశారు. ముడుపులు ముట్టజెప్పకుండా ఏ పని కావడం లేదని ఓ రెవెన్యూ అధికారి తన బాధను వెల్లగక్కారు.

# ఆడబిడ్డల వేడుకపై అంతులేని నిర్లక్ష్యం

## బతుకమ్మ వేడుకలకు నిధులివ్వని సర్కారు

- గత ప్రభుత్వ హయాంలో జిల్లాకు ₹10 లక్షల కేటాయింపు
- ఈసారి అణాపైసా కేటాయించని రేవంత్ సర్కారు
- మున్సిపల్, పంచాయతీల్లోనూ నిధుల లేమి
- ఏర్పాట్లపై చేతులెత్తేసిన అధికారులు
- చీరెల పంపిణీకి ప్రభుత్వం మంగళం
- చిన్నబోతున్న ఆడబిడ్డలు
- మాటలే తప్ప చేతల్లేవంటూ మండిపాటు



కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

**ఆడబిడ్డల అతిపెద్ద పండుగైన బతుకమ్మ వేడుకలపై రాష్ట్ర ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యం చూపుతున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏటా బతుకమ్మ ఏర్పాట్ల కోసం ప్రతి జిల్లాకు ₹10 లక్షలు కేటాయించినా.. ఈ సారి మాత్రం అణాపైసా కేటాయించలేదు. దీంతో పంచాయతీలు, మున్సిపాలిటీల్లో అధికారులు ఏర్పాట్లపై చేతులెత్తేశారు. మరోవైపు 'ఒకటి కాదు.. నా తెలంగాణ అక్కాచెల్లెళ్లకు, అవ్వలకు ఈసారి రెండేసి చీరెల చొప్పున అందజేస్తాం' అన్న సీఎం రేవంత్‌రెడ్డి మాట.. ఆచరణకు నోచుకోక పోవడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభుత్వం తమను చిన్నచూపు చూస్తున్నదని, మాటలే తప్ప చేతల్లేవని మండిపడుతున్నారు.**

కరీంనగర్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ కలెక్టరేట్ : 'నా తెలంగాణ అక్కాచెల్లెళ్లకు, అవ్వలకు ఈసారి రెండేసి చీరెల చొప్పున బతుకమ్మ పండుగ సారె అందజేస్తాం. నామమాత్రంగా కాదు, కలకాలం గుర్తుంచుకునేలా నాణ్యమైన చీరెలను పంపిణీ చేస్తాం' అంటూ కొద్ది నెలల క్రితం మహిళా సంఘాల సభ్యులతో హైదరాబాద్‌లో సమావేశమైన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఈ ప్రకటనతో ఆడబిడ్డలంతా సంతోషించారు. అయితే, నెలలు గడిచాయి. మహిళలు అతిపెద్ద పండుగగా భావించే బతుకమ్మ కూడా వచ్చింది. కానీ, సీఎం ప్రకటన మాత్రం కార్యరూపం దాల్చలేదు. ఎంతో ఆశతో ఎదురుచూసినా సద్దుల చీరెలు రాలేదు.. సారెలు పెట్టలేదు. పండుగ పూట తమకు కనీసం ఒక్క చీరైనా అందించకపోవడంతో మహిళలంతా రేవంత్ మాటలపై మండిపడుతున్నారు. మాటలే తప్ప చేతలేమీ లేవంటూ సర్కారుపై విరుచుకు పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏడేళ్లు క్రమం తప్పకుండా పంపిణీ చేసిన వైనాన్ని గుర్తు చేసుకుంటూ, కాంగ్రెస్ పాలనపై పెదవి విరుస్తున్నారు. కరోనా కష్టకాలంలో సైతం ఆడబిడ్డలకు బతుకమ్మ సారె అందించి తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట నిలుపుకున్నారని గుర్తు చేస్తున్నారు.

### నాడు ఆడబిడ్డలకు గౌరవం

తెలంగాణలో ఆడబిడ్డలను లక్ష్మీదేవితో పోల్చుకోవడం పరిపాటి. పండుగకైనా, పబ్బానికైనా వారికి బట్టలు పెట్టి, తమ స్థాయిని బట్టి గౌరవించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. స్వరాష్ట్రంలో ఆడబిడ్డలను సముచితంగా గౌరవించుకునే క్రమంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, హిందూ మహిళలకు బతుకమ్మ చీర, ముస్లింలకు రంజాన్ తోఫా, క్రైస్తవులకు దుస్తులు ఉచితంగా అందజేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఏడేళ్లు విజయవంతంగా బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్ పండుగల సందర్భంగా అధికారులతో గత ప్రభుత్వం పంపిణీ చేయించింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 9.5 లక్షల మంది వరకు పద్దెనిమిదేళ్లు నిండిన యువతుల నుంచి పండుటాకుల వరకు ఏటా చీరెలు అందించింది. ₹30కోట్ల నుంచి ₹35 కోట్ల వరకు ఖర్చు చేసి నేతన్నలకు ఆర్డర్లు ఇవ్వగా, నాణ్యతతో కూడిన చీరెలు తయారు చేశారు. 250కి పైగా రంగుల్లో 100కు పైగా డిజైన్లతో, 4 నుంచి 5 మీటర్ల పొడవుతో చీరెలు అందించారు. గతేడాది కూడా ఇదే విధంగా దసరాకు చీరెలు పంపిణీ చేసేందుకు గత ప్రభుత్వం సిద్ధం కాగా, కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి చీరెల పంపిణీని అడ్డుకున్నారు.



### నేడు చిన్నచూపు

ఎన్నికల అనంతరం కూడా మహిళలకు బతుకమ్మ చీరెలు అందజేయలేదు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళా సంఘాల సభ్యులతో సీఎం రేవంత్ నిర్వహించిన సమావేశంలో పలువురు మహిళలు ప్రశ్నించారు. దీంతో ఈ యేడు సద్దుల బతుకమ్మకు ఒక్కో మహిళకు రెండేసి చీరెలు అందజేస్తామంటూ రేవంత్ హామీ ఇచ్చారు. అయితే, ఆ హామీ మేరకు చీరల తయారీకి ఏప్రిల్, మే నెలలోనే నేతన్నలకు ఆర్డర్లు పెట్టాల్సి ఉండగా, ఇప్పటి వరకు కూడా ఆ ఊసే లేదు. మరో నాలుగు రోజుల్లో సద్దుల బతుకమ్మ పండుగ కాగా, ఈసారి కూడా బతుకమ్మ చీరెలు రావని మహిళలు నిరాశ చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం బేషజాలకు పోయి తమను చిన్నచూపు చూస్తున్నదని విమర్శిస్తున్నారు.



### నేతన్నల్లో నైరాశ్యం

తెలంగాణ మహిళల అతిపెద్ద పండుగ సద్దుల బతుకమ్మ ఎప్పుడొస్తుందా..? అంటూ ఎదురుచూసే నేతన్నల్లో ఈసారి నైరాశ్యం అలుముకున్నది. ఏడేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని నేతన్నలను ఆదుకునే క్రమంలో ఏటా మార్చి, ఏప్రిల్ నెలల్లోనే సుమారు కోటికి పైగా బతుకమ్మ చీరెలకు ఆర్డర్లు ఇచ్చేది. ఈ చీరెల నేతతో మూడు, నాలుగు నెలల పాటు ఉపాధి పొందేవారు. ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి ఆర్డర్లు ఇవ్వకుండా, బతుకమ్మ చీరెల పంపిణీ పథకానికి మంగళం పాడడంతో వేలాది నేత కుటుంబాలు ఉపాధి కరువై ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చేనేత సహకార పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు.

### బతుకమ్మ నిధుల విడుదలపైనా నిర్లక్ష్యమే

మహిళలు ప్రీతిపాత్రంగా భావించే బతుకమ్మ పండగను రాష్ట్ర ఆవిర్భావం అనంతరం అత్యంత వైభవంగా నిర్వహించుకునేందుకు తొలి సీఎం కేసీఆర్ ప్రతి జిల్లాకు ₹10 లక్షల చొప్పున నిధులు కేటాయించేవారు. ఆ మొత్తాన్ని చిన్న గ్రామపంచాయితీలకు పంపిణీ చేస్తూ, బతుకమ్మ ఆడే చెరువు గట్లపై పారిశుధ్య పనులు, లైటింగ్, బారికేడ్లు, ఇతర ఏర్పాట్లు చేసేవారు. అయితే, ఈసారి మాత్రం కనీస నిధులు కూడా విడుదల చేయకుండా కాంగ్రెస్ సర్కారు చేతులెత్తేసి, గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులపై భారం వేసింది. దీంతో, గ్రామాల్లో బతుకమ్మ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై అధికార యంత్రాంగం మల్లగుల్లాలు పడుతున్నది. నిన్నా మొన్నటి వరకు కురిసిన వర్షాలతో గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు పాడై పోగా, చెరువుకట్టలపైనా ఫీటుకు పైగా లోతు మట్టి కొట్టుకుపోయి గోతులు ఏర్పడ్డాయి. వాటికి మరమ్మతులు చేపడితేనే బతుకమ్మ వేడుకలు సజావుగా జరిగే అవకాశాలున్నాయి. కానీ, ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఈసారి ఏర్పాట్లపై గ్రామాల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పల్లెల్లో చీకట్లు కమ్ముకుంటుండగా, మహిళలు బతుకమ్మ ఆడుకునేందుకు, చెరువుల వద్ద నిమజ్జనం చేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత ప్రభుత్వం హిందువులతోపాటు ముస్లింలకు కూడా బతుకమ్మ చీరెలు నిరాటంకంగా పంపిణీ చేసింది. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ముస్లిం మహిళలు బతుకమ్మ, రంజాన్ సందర్భంగా పంపిణీ చేసే చీరెల కోసం వేచి చూసేది. ముస్లింలంతా ప్రధాన పండుగగా భావించే రంజాన్‌కు కూడా చీరెలు పంపిణీ చేయకపోవడంతో కాంగ్రెస్ సర్కారు తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది.



వేములవాడ టౌన్: మూలవాగులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



# ఎములాడ.. పూలవనం

- కనుల పండువలా సద్దుల బతుకమ్మ
- ఆనవాయితీ ప్రకారం ఏడు రోజులకే వేడుక
- ఆడబిడ్డల ఆటాపాటలతో మురిసిన మూలవాగు



వేములవాడ టౌన్: మూలవాగులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కరీంనగర్: బతుకమ్మతో కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

వేములవాడ టౌన్/ కరీంనగర్ రూరల్ /కొత్తపల్లి, అక్టోబర్ 8 : రాజన్న క్షేత్రం పులకించిపోయింది. మహిళల బతుకమ్మ ఆటపాటలతో మార్మోగింది. ఆనవాయితీ ప్రకారం ఏడు రోజులకు నిర్వహించిన సద్దుల బతుకమ్మ సంబురం అంబరాన్నంటింది. ఆడబిడ్డల సందడితో మూలవాగు మురిసిపోయింది. మంగళవారం ఉదయాన తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చిన మహిళలు, సాయంత్రం పట్టణంలోని కూడళ్ల వద్ద ఉంచి చీకటి పడేదాకా సంబురంగా ఆడిపాడారు. ఆ తర్వాత మూలవాగు తీసుకొచ్చి ఆటాపాటలతో హోరెత్తించారు. ఆ తర్వాత వాగులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. 'పోయిరా గౌరమ్మ.. పోయిరావమ్మా' అంటూ ఘనంగా వీడ్కోలు పలికారు. కరీంనగర్ జిల్లాలోని బొమ్మకల్, ఆసిఫ్‌నగర్, శ్రీనివాస్‌నగర్, రాఘవాపూర్, తోటకుంటపల్లిలోనూ సద్దుల బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించారు.



కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌లో..





వేములవాడ టౌన్: మూలవాగులో బతుకమ్మను నిమజ్జనం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్లు అరుణ, తుల ఉమ, మహిళలు